

నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి, ఎంపీ

## అభివృద్ధి, సంక్షేమం చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

**మంత్రి సత్యవతి రాథోడ్**

గూడూరు, నవంబర్ 24 : బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పార్టీలో వేలాది మంది బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నేతలు, కార్యకర్తలు స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరగా, ఎంపీ, జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవితతో కలిసి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ నాయకుడు ప్రజల వెంట ఉన్నాడో, ఏ పార్టీ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నాడో వివిధ పార్టీల కార్యకర్తలు, ప్రజలు గమనిస్తున్నారని, అందుకే నాయకులు మారినా కార్యకర్తలు, ప్రజలు బీఆర్ఎస్‌ను అక్కున చేర్చుకుని పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి గౌరవం, గుర్తింపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల నూకల నరేశ్ రెడ్డి, భీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, ఖాసీం, వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మణ్‌రావు, ఆరే వీరన్న, సురేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పడిపోయింది..

- నేడు మంత్రి హరీశ్‌రావు కార్నర్ షోను విజయవంతం చేద్దాం
- మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత

గూడూరు, నవంబర్ 24 : సాధ్యంకాని ప్రకటనలతో ప్రజలు తిరస్కరిండంతో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాధ్యంకాని, అమలు కాని వాగ్దానాలతో ప్రజలు కూడా నమ్మని స్థితిలో ప్రకటనలతో కాంగ్రెస్ చేస్తున్న నయవంచన మాటలకు ప్రజలు నవ్వుకుంటూ ఆ పార్టీని తిరస్కరిస్తున్నారన్నారు. రోజు రోజుకూ ఆ పార్టీ గ్రాఫ్ పడిపోతున్నదని తాజా సమాచారం. రాష్ట్రంలో బీఆర్ఎస్ 80 నుంచి 90 సీట్లను సాధించి ముచ్చటగా మూడో సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నదన్నారు. మండలంలో బీఆర్ఎస్ నాయకులు కలిసి సమన్వయంతో పనిచేస్తే రూ.10వేల మెజార్టీ వస్తుందని , ఒక్కరిద్దరూ నాయకులు పార్టీని వారి స్వార్థ ప్రయోజనాల కోసం వెళ్లినంత మాత్రానా కార్యకర్తలు పార్టీలో ఉన్నారని, మరింత కసిగా పనిచేస్తున్నారన్నారు. హరీశ్‌రావు కార్నర్ మీటింగ్.. మండల కేంద్రంలో శనివారం రోజు మంత్రి హరీశ్‌రావు కార్నర్ మీటింగ్ మండల కేంద్రంలో ఉంటుదన్నారు. ఈ కార్నర్ మీటింగ్ అంబేద్కర్ సెంటర్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూకల నరేశ్ రెడ్డి, బీ భరత్‌కుమార్‌రెడ్డి, వేం వెంకటకృష్ణారెడ్డి, సంపత్‌రావు, ఖాసీం, ఆరే వీర్న, ముక్కా లక్ష్మణ్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, రేగ వెంకన్న, నూకల సురేందర్, వేణుమాధవ్, రహీం, కతార్‌సింగ్, చీదురు వెంకన్న పాల్గొన్నారు.

## నేడు మానుకోటకు హరీశ్ రాక..

మహబూబాబాద్, నవంబర్ 24 : మహబూబాబాద్‌కు రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖా మంత్రి, తన్నీరు హరీశ్‌రావు శనివారం రానున్నారు. హైదరాబాద్ నుంచి హెలీక్యాప్టర్‌లో బయలుదేరి మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లోని మెలీప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి బస్‌స్టేషన్ సమీపంలోని వివేకానంద సెంటర్‌కు వాహనం ద్వారా చేరుకుని, అక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ గెలుపు కోరుతూ 11 గంటలకు రోడ్‌షో నిర్వహించనున్నారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో కార్యాలయ జంక్షన్‌లో ప్రజలనుద్దేశించి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించి ఓట్లను అభ్యర్థించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొననున్నారు. ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో హెలీప్యాడ్‌ను మంత్రి సత్యవతిరాథోడ్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మంత్రి సత్యవతి వెంట సీనియర్ నాయకులు మార్నేని వెంకన్న , డాక్టర్ సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

# అభివృద్ధిని పరుగులు పెట్టించిన బీఆర్ఎస్‌కు పట్టం కట్టండి

- 3 గంటల కరెంటిచ్చే కాంగ్రెస్సా? 3 పంటలించే బీఆర్ఎస్సా తేల్చుకోండి..
- కాంగ్రెకు ఓటేస్తే కర్నాటక దుస్థితే
- ఈ నెల 30న ఆగమవ్వద్దు.. ఆలోచించి అభివృద్ధిని ఆదరించండి
- బీఆర్ఎస్ మానుకోట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



నైనాలలో ఇంటింటి ప్రచారంలో ప్రసంగిస్తున్న శంకర్‌నాయక్

నెల్లికుదురు, నవంబర్ 24 : కేసీఆర్ సావునోట్లో తలపెట్టి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించిన బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని మానుకోట బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని నైనాల, రత్తిరాం తండా, నల్లగుట్టతండా, హనుమాన్‌నగర్ తండా, జామాతండా, సీతారాంపురం, రాజులకొత్తపల్లి, ఆలేరు గ్రామాల్లో శుక్రవారం మానుకోట బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మలు, మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో గ్రామదేవతలు కొబ్బరికాయలు కొట్టారు. ఇంటింటి కెళ్లి అవ్వ, అక్క, చెల్లి మీ అమూల్యమైన ఓటును ఈ నీ బిడ్డకు వేసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించండని అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రసంగించారు. 14 ఏండ్ల క్రితం అభివృద్ధిలో మనమెట్లున్నాం. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో 56 ఏళ్లు పాలించిన సీమాంధ్రులు చేయలేని అభివృద్ధిని కేసీఆర్ 10 ఏళ్లలో చేసి చూపించిండు. ఇప్పుడు మళ్లీ మీరు ఆశీర్వదించండి మీముందుకొస్తున్నాం. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మాత్రమే మాకు ఓటు వేయండని మీ వద్ద కొట్లాడే హక్కు ఉన్నదని, అభివృద్ధికి నామాలు పెట్టి అధికారంలో కొచ్చి అడ్డగోలుగా సంపాదించుకోవాలనే కాంగ్రెస్, బీజేపీలకు ఓటు అడిగే అర్హత లేదన్నారు. నాగు రూ. 200 పెన్షన్ కోసం పడరాని పాట్లు, రైతును పట్టించుకున్న పాపాన పోలే, తాగుతందుకు నీళ్లుండేవి కావు, సాగు నీళ్లు లేవ్, కరెంట్‌లేదు. పేదింటి ఆడపిల్ల పెండ్లికి వచ్చి తినిపోయెటోండ్లే తప్ప నయా పైసివ్వలేదు. అలాంటి ఆ పరిస్థితుల నుంచి ఇప్పుడు అభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నంబర్ వన్ స్థానంలో నిలిచింది. రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 3 వేలకు పెంచుకున్నం. దేశానికి అన్నంపెట్టే రైతన్నను అందళా లెక్కించి ఆనందంగా వ్యవసాయం చేసుకునేందుకు 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతుబీమాలు కల్పించిన ఏకైక రాష్ట్ర తెలంగాణ అన్నారు. నాడు మందుబాస్తాల కోసం క్యూలో నిలబడాల్సిన దుస్థితి ఉండెదన్నారు. 3 గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే 3 గంటల్లో నీళ్లు పారుతుందని చెప్పే కాంగ్రెస్సా కావాలా..? ఏడాదికి 3 పంటలు ఇచ్చే బీఆర్ఎస్ కావాలో తేల్చి చెప్పే సమయం మీ కొచ్చిందన్నారు. 6 గ్యారంటీలంటూ ప్రజలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ గ్యారెంటీలు ఎందుకు అమలు చేయలేక పోతున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ను నమ్మితే కర్నాటక రాష్ట్రం దుస్థితే ఏర్పడుతుందన్నారు. మీ బిడ్డగా నన్ను ముచ్చటగ మూడోసారి గెలిపించండి మీ పెద్ద పాలేరుగా పని చేసి మీ రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేకపోతు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, రైతు బంధు జిల్లా కో-ఆర్డినేటర్ భూక్యా బాలాజీ నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, రైతుబంధు సమితి మండల కో-ఆర్డినేటర్ కాసం వెంకటేశ్వర్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు గుండా వెంకన్న, కాసం లక్ష్మీచంద్రశేఖర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కే విజయ్ యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు బానోత్ బీముడు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు గుగులోత్ శారధ, సునిత, చంద్రారెడ్డి, టీ సంధ్యారాణి, కాలేరు శ్రీవాణి, షరీఫ్, పెరుమాండ్ల ఉపేందర్, చిర్ర శ్రీను, నవీన్, అజయ్, గుగులోత్ శ్రీను, హనుమ, బోజ్యా నాయక్, సాయిలు, సుమన్, రవి పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్‌నాయక్

### కాస్య తండాలో 50 కుటుంబాలు బీఆర్ఎస్‌లోకి చేరిక

నెల్లికుదురు: మండలంలోని కాస్యతండాకు చెందిన భూక్యా బాలాజీ నాయక్‌తో పాటు 50 కుటుంబాలు శుక్రవారం కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరారు. వారికి మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూక్యా బాలాజీ నాయక్ గతంలో బీఆర్ఎస్ పార్టీలోనే ఉండేవారని, కాంగ్రెస్ నాయకులు కల్లబొల్లి మాటలకు మోసపోయి ఆ పార్టీలో చేరారన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం తెలుసుకుని ఆ పార్టీలో ఉండలేక తిరిగి సొంతగూడు బీఆర్ఎస్‌కు వంచారని తెలిపారు. ఇది స్వయంగా బాలాజీ నాయక్ చెప్పిన మాటలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ మాయ మాటలకు మోసపోయి ఆ పార్టీలో చేరిన చాలా మంది తిరిగి సొంతగూటికి చేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ కార్యకర్తలారా మీరే పార్టీకి గట్టి పునాదులు. మీరే నా బలం, బలగం. మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. ఈ నెల 30 వరకు నా గెలుపు కోసం అహర్నిశలు పని చేయండి. నా గెలుపు మి గెలుపుగా బావించడని అన్నారు. బీఆర్ఎస్‌లో పని చేసేటోళ్లకు అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్ రెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కే విజయ్ యాదవ్, ఎంపీటీపీ కృష్ణయ్య, శ్రీరామగిరి సొసైటీ వైస్ చైర్మన్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ పొందిన ఓటర్లు.. పోలింగ్ కేంద్రంలో వేయొద్దు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక**

మహబూబాబాద్, నవంబర్ 24 : పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు పొందిన ఓటర్లు పోలింగ్ కేంద్రంలో వేయడానికి అవకాశం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక సూచించారు. శుక్రవారం ఐడీవోసీలోని జిల్లా సంబంధాల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్లో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నిర్వహణకు చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక పాత్రికేయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ జిల్లాలో ఫాం 12 డీ అందజేసిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వీలులేదన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్ జారీ చేసినట్లు మార్కింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న రెండు నియోజకవర్గాల్లో 496 మంది వినియోగించుకున్నట్లు తెలిపారు. పోస్టల్ బాలెట్ ట్లు మూడు వేలకు పైగా వచ్చాయన్నారు. అనంతరం ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ రిసెప్షన్ కౌంటింగ్ కేంద్రాలకు భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. రూ.24 లక్షలకు సంబంధించి 317 కేసులు నమోదు చేశామని తెలిపారు. రూ.8 లక్షల విలువైన 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసులు పెట్టామన్నారు.

## కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్

ఖిలావరంగల్, నవంబర్ 24: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు ఈ నెల 26 నుంచి 28 వరకు వరంగల్ కలెక్టరేట్‌లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాలలోని రిటర్నింగ్ కార్యాలయాలతోపాటు పోలింగ్ సిబ్బంది శిక్షణ ఇస్తున్న కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవాన్నారు.

## మహబూబాబాద్‌లో 454 హోమ్ ఓటింగ్ ఓట్లు పోల్..

మహబూబాబాద్, నవంబర్ 24 : మహబూబాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం ద్వారా నూతనంగా ఏర్పాటు చేసిన హోమ్ ఓటింగ్ ద్వారా 454 ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారిణి అలివేలు తెలిపారు. ఇందులో 80 ఏండ్లు దాటిన వారు 315 ఓట్లు వేయగా, దివ్యాంగులు 139 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వివరించారు. మిగిలిన 17 ఓట్లలో ఏడుగురు మృతి చెందగా, పదిమంది ఓటు హక్కు వినియోగించుకోలేదని చెప్పారు. డోర్నకల్‌లో 526 హోమ్ ఓట్లలో 508 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. మిగతా 18 ఓట్లకు ఓటింగ్ చేపడతామని డోర్నకల్ రిటర్నింగ్ అధికారి నర్సింహరావు తెలిపారు.

## ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

హనుమకొండ: ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు అజయ్ వి.నాయక్, దీపక్ మిశ్రా అధికారులకు సూచించారు. సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో అధికార యంత్రాంగం చేపడుతున్న కార్యక్రమాలపై శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్షించారు. అంతకముందు వారికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు జిల్లాల్లో ఓటర్ల వివరాలు, ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లు, ఈవీఎం ల కమిషనింగ్ ప్రక్రియ, పోస్టల్ బ్యా లెట్, హోం ఓటింగ్, పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాలు, ఇ ప్పటివరకు నమోదైన కేసుల వివరాలు, సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులు, సువిధ యాప్ ద్వారా ఇచ్చిన అనుమతులు, ఈవీఎం బ్యాలెట్ పంపిణీ కేంద్రా ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.